ప్రజాశక్తి
గురువారం 2 అక్టోబర్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

రిలే నిరాహారదీక్షలో ప్లకార్డులు చూపుతున్న పిహెచ్‌సి వైద్యులు

తోటి వైద్యులూ.. సంఘీభావంగా నిలవండి

- మూడో రోజుకు పిహెచ్‌సి వైద్యుల సమ్మె
- డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్టెతస్కోప్ పట్టుకుని రోగుల నాడి చూడాల్సిన వైద్యులు ప్లకార్డులు చేత పట్టుకుని రోడ్డెక్కారు. పల్నాడు జిల్లాలోని అన్ని పిహెచ్‌సిల వైద్యులు సమస్యల పరిష్కారం కోసం విధులు మానుకుని నరసరావుపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ (డిఎంహెచ్‌ఒ) కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేస్తున్నారు. దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరడంతో వైద్యసేవలు స్తంభించాయి. దీనికి ప్రత్యామ్నాయంగా డిఎంహెచ్‌ఒ కార్యాలయం నుండి 25 మంది వైద్యులను పిహెచ్‌సిలకు పంపి వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ అంశంలో ప్రభుత్వ తీరును ఏపీ పిహెచ్‌సి డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు డాక్టర్ మమత తప్పుబట్టారు. జీవో 99ను రద్దు చేయాలని, దశాబ్దాలుగా పనిచేస్తున్న వైద్యులకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులతో వైద్యశాఖ కమిషనర్ చర్చలు విఫలమైన నేపథ్యంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, తమకు తోటి వైద్యులు సంఘీభావంగా నిలవాలని కోరారు.

ట్రాఫిక్ ఆంక్షలు! ప్రయాణికులకు కష్టాలు!!

- గుంటూరు నగరంలోకి బస్సులను రానివ్వని వైనం
- ట్రాఫిక్ పోలీసుల తీరుతో ఉచిత బస్సు ప్రయాణం హుళక్కి
- 50 గ్రామాల మహిళలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులో శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం నేపథ్యంలో తాడికొండ, పెదకూరపాడు నియోజకవర్గాలకు చెందిన 50 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరితో పాటు నిత్యం రాజధానికి వెళ్లే హైకోర్టు, సచివాయలం ఉద్యోగులు రాకపోకలకు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. గుంటూరు ట్రాఫిక్ పోలీసు అధికారుల ఏకపక్ష నిర్ణయం వల్ల ఈ సమస్యలు వచ్చి పడ్డాయి. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినా గోరంట్ల నుంచి లాడ్జి సెంటర్ వరకు ట్రాఫిక్ సమస్యలు లేవు. అయితే అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట, తాడికొండ, తుళ్లూరు, గుంటూరు రూరల్‌కు

విశాలంగా ఉన్న విద్యానగర్ రహదారి

చెందిన దాదాపు 50 గ్రామాలకు చెందిన ప్రజలు అమరావతి రోడ్డు మీదుగా గుంటూరు వస్తుంటారు. వీరితో పాటు సచివాలయం, హైకోర్టులో కూడా ఉద్యోగాలు చేసి సాయంత్రం కల్లా గుంటూరు చేరుకుంటారు. అయితే పోలీసు అధికారులు ఆర్‌టిసి బస్సులను గుంటూరు నగరంలోకి రానివ్వకుండా గోరంట్ల నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు రెడ్డిపాలెం, ఆటోనగర్ మీదుగా ఆర్‌టిసి బస్టాండ్‌కు బస్సులను మళ్లిస్తున్నారు. దీంతో గుంటూరు నగరంలోకి రావాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వీరంతా గోరంట్ల చిల్లీస్ జంక్షన్‌లో దిగి ఆటోల్లో గుంటూరు నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే ▶ 2లో

పింఛన్ల పంపిణీలో కలెక్టర్లు

ప్రజాశక్తి మంగళగిరి, యడ్లపాడు

సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు పింఛను నగదును బుధవారం లబ్ధిదార్లకు అందించారు. గుంటూరు కలెక్టర్ మంగళగిరిలో, పల్నాడు కలెక్టర్ చిలకలూరిపేట మండలం యడ్లపాడులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. మంగళగిరిలోని టిడ్కో కాలనీలో పింఛన్లను పంపిణీ చేసిన గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,56,904 మందికి రూ.111.34 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారుల్లో వృద్ధులు 1,18,174, వితంతువులు 70,112, చేనేతలు 3,862., గీతకార్మికులు 443, మత్స్యకారులు 570, ఒంటరి మహిళలు 11,330, చర్మకారులు 876, హిజ్రాలు 67, హెచ్ఐవి బాధితులు 2,614, కళాకారులు 77, డప్పు కళాకారులు 854, దివ్యాంగులు 24,835, వైద్య సంబంధిత పింఛనుదారులు 1667, సైనిక సంక్షేమం 28, అభయహస్తం 3,994, అమరావతి భూముల సంబంధిత ▶ 2లో

నేడు మాసం, చేపల విక్రయాలు నిషేధం

ప్రజాశక్తి-గుంటూరు

గాంధీ జయంతిని పురస్కరించుకొని నేడు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మాంసం, చేపల విక్రయాలు పూర్తిగా నిషేధిస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గాంధీ జయంతి రోజున మాంస విక్రయాలు నిషేదం అమలులో ఉంటాయన్నారు. నగరంలోని మాంసం, చేపల విక్రయదారులే కాకుండా, హెూటల్స్, రెస్టారెంట్లకు కూడా ఈ నిషేధ ఉత్తర్వులు అమలవుతాయన్నారు. నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు వార్డుల ల వారీగా నిషేధం అమలును పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

డ్రెయిన్లను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

డ్రెయిన్లలో వ్యర్థాలు నిలవకుండా చూడాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో అంతర్గత డ్రైన్లలో వ్యర్థాలు నిల్వకుండా ప్రజారోగ్య కార్మికులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, డ్రైన్లలో వ్యర్థాలు వేసే కమర్షియల్ సంస్థలకు భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ ఆర్ అగ్రహారం, ఎత్తురోడ్ సెంటర్, అడపావారి వీధి, ఏడుగొందుల సందు, సంగడిగుంట ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్యం, అభివద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైన్లలో వ్యవర్థాలు ఎప్పటికప్పుడు తొల గిస్తే వర్షపు నీరు నిలవదన్నారు. పర్యటనలో కార్పొరేటర్లు వేముల జ్యోతిపద్మజ, నిమ్మల వెంకట రమణ, డిఈఈ శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌కుమార్

వృద్ధులు దేశానికి విలువైన సంపద

ప్రజాశక్తి-గుంటూరు

వృద్ధులు దేశానికి విలువైన సంపద అని, దేశాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంచటానికి ప్రభుత్వాలు ప్రత్యేక కృషి జరపాల్సి ఉందని డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ అన్నారు. బుధవారం అవగహన సంస్థ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వివి రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వద్ధుల సంఖ్య పెరుగుతుందని, ఓపిక, ఆరోగ్యంతో వున్నవారు, సమాజ ప్రగతి పదంలో తమవంతు పాత్రను పోషించాలి అని అన్నారు. ప్రభుత్వాలు కూడా వారిని పరిరక్షించాల్సిన అవసరం వున్నది తెలియజేశారు.ఆధునిక విద్య విజ్ఞానం అందిస్తున్న మెరుగైన వైద్యంతో ఆరోగ్య కరమైన జీవితం పొంది ఆనందంగా కుటుంబ జీవితంతో సమాజానికి తగిన సేవలు అందించాలని అన్నారు. పాజిటివ్ ఆటిట్యూడ్‌తో వృద్దా ప్యాయంలో వచ్చే వ్యధలు, బాధలు చాలా చిన్నగా కన్పిస్తాయని, ఇలా ఉంటే జీవితం చాలా చాలా మధురంగా అనిపిస్తుందని చెప్పారు. కార్యక్రమానికి జీవన సంధ్య వికాస వేదిక అధ్యక్షులు సీసరపల్లి కృష్ణారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గాయత్రి బ్యాంకు మేనేజర్ తేళ్ళ సుబ్బారావు, చల్లా అంజిరెడ్డి పాల్గొన్నారు.

కుమ్మక్కైన ఇరిగేషన్ అధికారులు

'తీర్మానం నీటిపారుదలకు అడ్డంకిగా మారిన చెట్ల కొమ్మలు తొలగించడం... నిర్వాకం.. ఏకంగా చెట్లని తొలగించడం.. కష్ణ వెస్టన్ డెల్టా పరిధిలో ఇరిగేషన్ అధికారుల తీరు ఈ పరిస్థితికి అద్దం పడుతుంది. కాలువ కట్టలపై ఉన్న భారీ చెట్లను డిస్టిబ్యూటరీ కమిటీ తీర్మానాన్ని అడ్డం పెట్టుకుని, ఇష్టానుసారం చెట్లను నరికి అమ్ముకుంటున్న వైనానికి అధికారులు వంత పాడుతున్నారు. వివరాల్లోకి వెళితే...

- **తీర్మానం కొమ్మలు నరకటం..**
- **నిర్వాకం చెట్లను తొలగించడం..**
- **అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు**

కాలువలోకి వాలిన చెట్ల కొమ్మలు

భారీ వర్షాలు వరదలకు ఇరిగేషన్ కాలువ కట్టలు అక్కడక్కడ గండ్లు పడుతున్న సంగతి తెలిసిందే. అయితే వాటిని పూడ్చేందుకు ఇరిగేషన్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకునేందుకు చెట్ల కొమ్మలు అడ్డంకిగా ఉన్నాయని, అసలు గండ్లు పడటానికి కారణం కూడా చెట్ల కొమ్మలేనన్నది అధికారుల వాదన. వాటిని తొలగించేం దుకు డిస్ట్రిబ్యూటరీ కమిటీలో ఇటీవల తీర్మానం చేశారు. అయితే ఆ తీర్మానాన్ని అడ్డం పెట్టుకుని అధికారులు అడ్డ దారులు తొక్కుతున్నారన్న విమర్శలున్నాయి. దీనికి తాజా ఉదాహరణ వైకుంఠపురం నుంచి కూచిపూడి లాకుల వరకు మధ్య కాలువ కట్టపై ఉన్న చెట్లు కొమ్మలు కాలువలలోకి వంగి ఉన్నాయి. వాటిని తొలగించాలని ఇటీవల డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులు మునాఫ్ ఆధ్వర్యంలో తీర్మానం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఆమేరకు చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఓ బృందం బుధవారం రంగ ప్రవేశం చేసింది. ఏకంగా చెట్ల కొమ్మలతో పాటు చెట్లను కాండం వరకు నరికి, వాటిని పెద్దపెద్ద మొద్దులుగా కత్తిరించి, జెసిబి సాయంతో రోడ్డుమీద నిలిపి ఉంచిన ట్రాక్టర్ లోకి ఎక్కించి, బయటకు తరలిస్తున్నారు. చెట్ల తొలగింపు పై ఘటనా స్థలంలో ఉన్న వ్యక్తులను ప్రశ్నించగా డిసి మెంబర్ చెట్లను నరికి తీసుకు వెళ్ళమని చెప్పారని అంటున్నారు. ఇక ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వింతైన సమా ధానాలు ఎదురవు తున్నాయి. పొరపాటు జరిగిందేమో, తెలుసుకుని సరి చేస్తామంటున్నారు. పైగా ఇకనుంచి ఇరిగేషన్ సిబ్బంది పర్యవేక్షణలో పనులు జరుగుతాయని చెప్పారు. అంటే వారి పర్యవేక్షణ లేకుండా ప్రైవేటు వ్యక్తుల హవా నడుస్తున్నట్లు అధికారులు చెప్పకనే చెబు తున్నారు. వారి సమాధానాలు అధికారుల బాధ్యతా రాహిత్యాన్ని స్పష్టం చేస్తున్నాయి. అదే సమయంలో చెట్ల తొలగింపునకు, వాటిని బయట విక్రయించేందుకు అధికారులే సూత్రధారులన్న విమర్శలు కూడా ఉన్నాయి. చెట్లను మొదలు వరకు తొలగించి, అవి కనిపించకుండా ఉండేందుకు చెట్ల కొమ్మలను కప్పి ఉంచుతున్నారు. గతంలో కూచిపూడి లాకుల వద్ద ఉన్న ఐరన్ సామాగ్రి కూడా అధికారుల చేతివాటంతోనే గల్లంతయినట్లు సమాచారం.

పొరపాటు జరిగితే సరి చేస్తాం

-ఇరిగేషన్ అధికారులు, తెనాలి

చెట్ల నరికివేత పై కూచిపూడి ఎఇ ఎల్ దివ్యభారతి వివరణ కోరగా వాస్తవానికి నీటిపారుదలకు అడ్డంకిగా ఉన్న కొమ్మలు మాత్రమే నరకాలని, ఏం జరిగిందో

ట్రాక్టర్ పై తరలిస్తున్న మొద్దులు

తెలుసుకుంటానని బదులిచ్చారు. తెనాలి ఎఇ శివరామకృష్ణ ను సంప్రదించగా అది కూచిపూడి ఎఇ పరిధిలోని అంశమని, అయినా కొమ్మలే నరుకుతున్నారు కదా? ఇబ్బంది ఏంటని ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఏఈల తీరుపై డి ఇ ఆర్ శ్రీనివాసరావును వివరణ కోరగా టైల్ ఎండ్ వరకు నీళ్లు వెళ్లాలని, దానికి చెట్ల కొమ్మలు అడ్డంకిగా ఉన్నాయని చెప్పారు. కాలువకు గండిపడిన సందర్భంలో ఆ ప్రాంతానికి వెళ్లడానికి కూడా చెట్ల కొమ్మలు ఇబ్బంది కరంగా ఉంటున్నాయన్నారు. అందుకే కొమ్మలు తొలగించాలన్న డిసి తీర్మానంతో పనులు చేపట్టామని, పొరపాటు జరిగితే శుక్రవారం నుంచి జెఇ పర్యవేక్షణలో పనులు జరిపిస్తామని చెప్పారు. (ప్రజాశక్తి - తెనాలి)

పించన్ల పంపిణీలో కలెక్టర్లు

(మొదటి పేజీ తరువాయి)

పింఛనుదారులు 17,401 మంది ఉన్నారని వివరించారు. ఇదిలా ఉండగా మౌలిక సదుపాయాలు కొరత, మురుగు నీరు రహదారులపై నిలవడం, కుక్కలు బెడద తదితర సమస్యలను స్థానికులు కలెక్టర్ దృష్టికి తేగా పరిష్కారానికి సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యడ్లపాడులో పల్నాడు కలెక్టర్ కృతక శుక్లా మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 2 లక్షల 72 వేల మందికి రూ.120 కోట్ల పింఛను అందిస్తున్నట్లు తెలిపారు. పింఛన్లను సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకే ఇచ్చి ఇస్తున్నారా? లేదా? అని అడగడంతోపాటు వారి మాట తీరుపైనా వివరాలు తెలుసుకున్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు! ప్రయాణికులకు కష్టాలు!!

(మొదటి పేజీ తరువాయి)

రెండు, మూడు ఆటోలు మారాల్సి వస్తోంది. అంతేగాక ఇటీవల ఆటో ఛార్జీలను కూడా పెంచారు. దీంతో స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం ఈ మార్గంలో అపహాస్యం పాలైంది. తుళ్లూరు, తాడికొండ, అమరావతి, క్రోసూరు, అచ్చంపేట, మండెపూడి, రావెల, ముక్కామల, వడ్డమాను తదితర మార్గాల నుంచి బస్సులో ఉచితంగా గోరంట్ల వరకు వచ్చి గుంటూరులోకి రావాలంటే మళ్లీ రూ.50 నుంచి రూ.100 ఆటోలకు వెచ్చించాల్సి వస్తోంది. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన తరువాత కొంత కాలం మార్కెట్, కలెక్టరేట్ రోడ్డు, స్తంభాలగరవు, కుందుల రోడ్డు, బృందావన్ గార్డెన్స్ మీదుగా లాడ్జి సెంటర్ నుంచి అమరావతి రోడ్డుకు బస్సులను అనుమతించారు. అమరావతి రోడ్డునుంచి వచ్చే వాహనాలను కూడా ఇదే మార్గాన్న నడిపేందుకు అనుమతించారు. అయితే లక్ష్మీపురం రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని పలువురు వ్యాపార సంస్థల ముందే కార్లు ఆపి వెళ్తున్నారని, బస్సులను ఈ మార్గంలో నిలిపివేశారు. అమరావతి రోడ్డు వెళ్లే బస్సులను మార్కెట్, కలెక్టరేట్, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల, జెకెసి కళాశాల మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా అమరావతి రోడ్డులోకి మళ్లించారు. దీని వల్ల నగరంలోని వివిధ ప్రాంతాల వారు జెకెసి కళాశాల రోడ్డు వద్ద బస్సు స్టాప్‌కు చేరుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అమరావతి రోడ్డు నుంచి వచ్చే వారు గోరంట్ల నుంచి రెడ్డిపాలెం రోడ్డు ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా ఆటోనగర్ నుంచి బస్టాండ్‌కు వెళ్లాల్సి వస్తోంది. ట్రాఫిక్ పోలీసు అధికారులు ఈ మార్గంలోని 50 గ్రామాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమరావతి రోడ్డు నుంచి లాడ్జి సెంటర్ వరకు యథావిధిగా అనుమతించి అక్కడ నుంచి హరిహరమహల్, కొరిటపాడు, విద్యానగర్, రింగ్ రోడ్డు, గుజ్జనగుండ్ల ద్వారా స్తంభాల గరవు మీదుగా మార్కెట్ సెంటర్‌కు వెళ్లేలా అనుమతించాలని ప్రయాణికులు కోరుతున్నారు. కొరిటపాడు, విద్యానగర్ మార్గంలో ట్రాఫిక్ అంతగా ఉండదని, దాదాపు ఆరు లైన్ల రహదారి అందుబాటులో ఉందని ట్రాఫిక్ నిపుణులు చెబుతున్నారు. లక్ష్మీపురం రోడ్డు ఇరుకుగా ఉన్నందున విద్యానగర్, రింగ్ రోడ్డు మీదుగా ఆర్‌టిసి బస్సులను అనుమతించాలని మహిళలు కోరుతున్నారు. తద్వారా తమకు ఉచిత బస్సుల లక్ష్యం నెరవేరుతుందని మహిళలు అభిప్రాయపడుతున్నారు.

ఎస్‌పి ఆఫీసు ఎదుట ముగ్గురు మహిళల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తమపై దాడి చేసి కొట్టిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని ముగ్గురు మహిళలు బుధవారం జిల్లా ఎస్‌పి కార్యాలయం ఎదుట కొద్ది సేపు ధర్నా నిర్వహించారు. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామంలో 15 రోజుల క్రితం తమపై దాడి జరిగిందని గ్రామంలోని దళిత వాడకు చెందిన కోటేశ్వరమ్మ, ఆమె మైనర్ కుమార్తెతో పాటు మరో మహిళ ధర్నాకు దిగారు. ఈ అంశంపై గత సోమవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదని వారు తెలిపారు. టిడిపి నాయకులకు మేడికొండూరు పోలీసు అధికారులు వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్య ంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు చెబుతున్నారు.

కళారూపాల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజా సమస్యల పరిష్కారం కొరకు కళాకారులు కళారూపాల ద్వారా పరిష్కారానికి కృషి చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు ఆర్.వి రాఘవయ్య అన్నారు. బుధవారం రాత్రి మంగళగిరి పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ప్రజానాట్యమండలి పట్టణ మహాసభ కే బుజ్జి బాబు అధ్యక్షతన జరిగింది. రాఘవయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ పాలకుల విధానాల వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆ ఇబ్బందులను కళాకారులు పాటలు, కళారూపాల ద్వారా ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. మతోన్మాద, కార్పొరేట్ విధానాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆలంబిస్తుందని విమర్శించారు. ఆ విధానాలు పేద ప్రజలకు ఎలా నష్టం కలిగిస్తాయో కళాకారులు వివరిం చాలని కోరారు. అనంతరం 9 మందితో ప్రజా నాట్య మండలి మంగళగిరి పట్టణ కమిటీ ఎన్నికయింది. పట్టణ కన్వీనర్ గాలి శ్రీనివాసరావు, కో కన్వీనర్లుగా కే బుజ్జిబాబు, కే నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సభలో ప్రజానాట్య

మాట్లాడుతున్న రాఘవయ్య

మండలి నాయకులు పి ప్రసాద్, ప్రజాసంఘాల నాయకులు వివి జవహర్లాల్, ఎం రవి, పిల్లలమర్రి బాలకృష్ణ, ఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు జిజిహెచ్‌లో ప్రత్యేక వార్డు

ప్రారంభించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అంతర్జాతీయ వద్ధుల దినోత్సవం సందర్భంగా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో 15 పడకల సామర్థ్యంతో వృద్ధులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. ఈ వార్డును జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం ప్రారంభిం చారు. జనరల్ మెడిసిన్ విభాగ వైద్యుల పర్యవేక్షణలో ఈ విభాగాన్ని సేవలు అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. అదేవిధంగా డెంటల్ ఓపిలో డెంటల్ ఎక్రే రూ. 1.20 లక్షల వ్యయంతో కలెక్టర్ ప్రారంభించారు. జిజిహెచ్‌లో డెంటల్ ఎక్స్‌రే అత్యంత తక్కువ రేడియేషన్‌తో

వృద్ధులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ రమణ తెలిపారు. ఆస్పత్రిలో స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినిల క్లాస్ రూమ్ లో హాస్టల్, వంటగదిని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అదే విధంగా గైనకాలజీ వార్డ్‌లో గర్భిణులతో మాట్లాడి ఆసుపత్రి సేవలు ఎలా ఉన్నాయో తెలుసు కున్నారు. పీడియా ట్రిక్ వార్డు, ఐసియూ, మెడికల్ స్టోర్సును పరిశీలించారు. ఆస్పత్రిలో ఉన్న రిపేర్లను, శాని టేషన్‌ను మెరుగ్గా చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

19 ఆర్.ఓ ప్లాంట్‌లు తాత్కాలిక సీజ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

డయేరియా ప్రభలిన నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 19 ఆర్.ఓ ప్లాంట్ లు తాత్కాలికంగా సీజ్ చేసినట్లు జిల్లా పంచా యతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ తెలిపారు. బుధవారం తెనాలి మండలం బుర్రి పాలెం గ్రామ పంచాయతీ, గుడివాడ గ్రామ పంచా యతీ, తుళ్ళూరు మండలం అనంతవరం, తుళ్ళూరు, లింగయ పాలెంలలో గల మొత్తం 19 ఆర్.ఓ ప్లాంట్ లను తాత్కాలికంగా సీజ్ చేసి నోటీసులు జారీ చేయడం జరిగిందని వివరించారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు 3
గురువారం 2 అక్టోబర్ 2025

విద్యార్థుల మృతదేహాలు

హెడ్ రెగ్యులేటర్ వద్ద మృతదేహాలు

ప్రజాశక్తి - నకరికల్లు

సాగర్ మెయిన్ కెనాల్‌లో ఈతకు దిగి గల్లంతయిన విద్యార్థుల మృతదేహాలు బుధవారం మధ్యాహ్నం అడ్డరోడ్డు హెడ్ రెగ్యులేటర్ వద్ద లభ్యమయ్యాయి. సంఘటనా స్థలానికి సత్తెనపల్లి రూరల్ సిఐ చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు అందజేశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సతీష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అధికారిక వాట్సాప్ గ్రూపు నుండి వైదొలగిన సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - చేబ్రోలు

ప్రభుత్వ అధికారిక వాట్సప్ గ్రూపు నుండి సచివాలయ సిబ్బంది వైతొలగింది. ఏపివి డబ్ల్యూఎస్ఈ , జేఏసి రాష్ట్ర కార్యవర్గం పిలుపుమేరకు అధికార వాట్సప్ గ్రూపుల నుండి విరమించుకోవాలని నిర్ణయించుకున్నామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులమైన మాకు అప్పగించిన విధులు నిర్వహించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటా మన్నారు. అయితే మా ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసేలా, వాలంటీర్ విధులు మాకు అప్పగించటం బాధాకరం ఆవేదన చెందారు. వాట్సాప్ గ్రూపుల నుండి వైదొలిగినప్పటికీ రోజు గ్రామ వార్డు సచివాలయ పని వేళలు ఉదయం 10 :30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కార్యాలయంలోనే అందుబాటులో ఉంటామని తెలిపారు. మా న్యాయమైన డిమాండ్స్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మనవి చేస్తున్నామన్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి- తాడేపల్లి

ఈ సంవత్సరం పెద్ద ఎత్తున వర్షాలు కురుస్తుండటంతో అనేక కాలనీలు నీట మునుగుతున్నాయని, ఇళ్ల ముందు వర్షపు నీరు నిలబడి ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో ఎక్కడికక్కడ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బురగా వెంకటేశ్వర్లు ఎంటిఎంసి అధికారులకు విజ్ఞప్తి చేశారు. సిపిఎం శాఖా కార్యదర్శులు, పట్టణ కమిటీ సమావేశం గాదె సుబ్బారెడ్డి అధ్యక్షతన మేక అమరారెడ్డి భవన్లో నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని కోరారు. బ్లీచింగ్, ఫినాయిల్, ఎంబీ ఆయిల్ చల్లించాలని కోరారు. దోమలు విస్తరించ కుండా ఖాళీస్థలాల్లో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యశిబిరాలో నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని, ఆ మేరకు ఎంటిఎంసి కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

టిఫిన్ బండి అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి

రాజధాని ముఖద్వారం అయినా ఉండవల్లిలో రావుల మస్తాన్‌రావు కొన్నేళ్లుగా గ్రామంలో అద్దె బండిపై చిరుహోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిసున్నారు. సొంతగా టిఫిన్ బండిని అంద జేయాలని మంత్రిలోకేష్‌కు అర్జీ అందజేశారు. బుధవారం మస్తాన్ రావు జీవనోపాధి నిమిత్తం స్థానిక టీడీపీ నాయ కులచే టిఫిన్ బండి అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యన్నారాయణ, మండల పార్టీ అధ్యక్షులు దాసరి కష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు వంగ నరేంద్ర, గాదె బసివిరెడ్డి, సనక బుజ్జి, ప్రశాంత్, లీలాకృష్ణ భార్గవ్, కోటి,రాము, కునపురెడ్డి రమేష్,రవితేజ, మౌనిక, రమాదేవి, రాఘవ ఉన్నారు.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమం జరిగింది. వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు వ్యవసాయ రంగంలో రైతులకు సూపర్‌గిఫ్ట్ ఇచ్చిందని అన్నారు. ఎంపీడీవో ఊహారాణి , డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, ఏఈఓ మోహన్, గ్రామ వ్యవసాయసహాయకులు, టిడిపినాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

బుధవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై పెదనందిపాడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. టిడిపి పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షులు జంపని హనుమంతరావు మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లపై 18 శాతం జిఎస్టి 5 శాతానికి తగ్గించారని తెలిపారు. ఇంచార్జ్ ఎంపీడీవో స్వామి రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు కోడూరి రాంబాబు, రావి శివరామ కృష్ణయ్య, చెన్నుపాటి సురేంద్ర, దివి నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

అమీనాబాద్ గ్రామంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి డ్వామా పిడి. శంకర్ మండల పరిషత్ అభివద్ధి అధికారి కె.రవిబాబు డిప్యూటీ ఎంపీడీవో శ్రీ సిహెచ్ వెంకటేశ్వరరావుపంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందజేసిన జీఎస్టీ తగ్గింపు అవకాశాన్ని వినియోగదారులు ఉపయోగించుకోవాలని తెలిపారు.

డోర్ టు డెస్టినేషన్ ప్రోగ్రాం మంజూరు

ప్రజాశక్తి - తెనాలి

డిసీజ్ ఫ్రీ తెనాలి కోసం పట్టణానికి చెందిన డి3 సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ డి.శారద చేసిన ప్రయత్నం ఫలించింది. డోర్ టు డెస్టినేషన్ పేరిట కార్యక్రమాలు నిర్వహించేందుకు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నుంచి అనుమతి లభించినట్లు బుధ వారం డాక్టర్ శారద వెల్లడించారు. స్థానిక చినరావూరులో నిర్వహిం చిన సమావేశంలో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డి 3 సర్వీస్ ససైటీ తరపున గత 30 సంవత్సరాలుగా డాక్టర్ శారద చేస్తున్న సేవలను ఆమె కొనియాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెవి గోపాలకష్ణ, డివిల్ సోమయ్య శాస్త్రి, కౌన్సిలర్ కుర్రా సుజాత, పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నన్నపనేని రాజకుమారి

రోడ్డుకడ్డంగా గండి కొట్టిన రైతులు

పంటలను కాపాడండి : రైతులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఇటీవల వరుస భారీ వర్షాలతో పంటలన్నీ నీట మునిగి, రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి దాపురించింది. తాడేపల్లి మండలంలో కుంచనపల్లి, గుండిమెడ, వడ్డేశ్వరం, మెల్లంపూడి, కొలనుకొండ ప్రాంతాలలో భారీ అధిక వర్షాలకు పొలాలలో వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. పంట పొలాలలో తీసిన కందకాలు (డ్రైనేజీ కాలువ) పూడుకు పోవడంతో పంట పొలాలలో వ్యర్థపు వర్షపు నీరు బయటకు పోయే దారి లేక పంటలు పాడయ్యాయి. రెండు రోజులుగా పొలాలలో ఉన్న డొంకలకు అడ్డంగా గండ్లు కొట్టుకొని రైతులు నీళ్లు మళ్లించుకునే పరిస్థితి ఏర్పడింది. వర్షపు నీరు బయటకు పంపేందుకు రోడ్డుకు అడ్డంగా గండ్లు కొట్టడంతో పలు ప్రాంతాలలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కేఎల్‌యు వైపు నుండి గుండిమెడ వైపు వెళ్ళు కొత్త రోడ్డుకి అడ్డంగా రైతులు గండి కొట్టడంతో ఆ ప్రాంతంలో రైతులు, గ్రామీణ ప్రజలు, విద్యార్థుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కుంచనపల్లి నుండి గుండిమెడ వైపు వెళ్ళు పొలిమేర డొంక ప్రాంతంలోనూ రైతులు గండ్లు పెట్టడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రైతుల పంట పొలాల ముంపు నివారణ శాశ్వత చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రాంత రైతులు అధికారుల ను కోరుతున్నారు.

సామాజిక పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని వడ్లమూడి గ్రామంలో పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ధూళి పాళ్ల నరేంద్ర కుమార్ బిజీగా గడిపారు. అనంతరం గురువు పాలెంలో సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో పాల్గొని, వృద్ధులకు, దివ్యాంగు లకు ఇంటి వద్దనే పెన్షన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో టి.ఊహరాణి, డిప్యూటీ ఎంపిడీవో ఎం.రవిశంకర్, పంచాయతీ కార్యదర్శి జి.సుభాష్ చంద్రబోస్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వద్ధులు ఆరోగ్యంపై జాగ్రత్త తీసుకోవాలని ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ అన్నారు. అక్టోబర్ ఒకటవ తేదీ అంతర్జాతీయ వృద్ధుల దినోత్స వం సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలోని వృద్ధుల ఆరోగ్య సంరక్షణ జాతీయ కార్యక్రమం ఆధ్వర్యంలో అక్టోబర్ మొత్తం ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయన్నారు. వృద్ధుల ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడం, వ్యాధులను తొందరగా గుర్తించి సరైన చికిత్స అందించాలన్నారు.డాక్టర్లు నివేదిత ఫిజియోథెరపీ, ఎన్ పావని జనరల్ సర్జరీ, ఎస్.వర్షశ్రీ అనస్థీషియా, హెడ్‌నర్స్ శారదదేవి పాల్గొన్నారు.

తెనాలి : వయోవృద్ధుల దినోత్సవాన్ని స్థానిక కవి రాజా పార్కులోని విజికే భవన్లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ఆధ్వర్యంలో నిర్వహించారు. అసోసి యేషన్ అధ్యక్షులు మొవ్వ సత్య నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డాక్టర్ రామ్ చంద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ వృద్ధులైన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసోసియేషన్ కార్యదర్శి పి.పూర్ణ చంద్ర రావు, ఉపాధ్యక్షులు కోటిరెడ్డి, ఈశ్వర్ చంద్ పాల్గొన్నారు.

నిలకడగా కృష్ణా వరద ప్రవాహం

ప్రజాశక్తి - తాడేపల్లి : ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణనదికి వరద ప్రవాహం బుధవారం నిలకడగా కొనసాగుతోంది. బ్యారేజీ వద్దకు పై నుండి 6 లక్షల 61 వేల 974 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతుంది. అంతే స్థాయిలో నీటిని బ్యారేజ్ దిగువకు సముద్రం లోకి విడుదల చేస్తున్నారు. వివిధ పంట కాలువలకు 13 వేల 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

మహారాజశ్రీ తెనాలి 2వ అదనపు సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్. 36/2025

బిట్వీన్:
గనిపిశెట్టి జగన్మోహనరావు ....వాది
వర్సెస్
కొప్పరాజు రామకృష్ణ ... ప్రతివాది

టు : ప్రతివాది : కొప్పరాజు రామకృష్ణ,
తండ్రి : వెంకటేశ్వరరావు, చింతలపూడి గ్రామం,
దుగ్గిరాల మండలం, గుంటూరుజిల్లా.

పై వాది, మీపై పై కోర్టులో ప్రామిసరీ నోటు బాకీ వసూలు కొరకు దావా దాఖలు చేయగా అందు మీకు కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా నోటీసు ఎన్ని పర్యాయములు పంపిననూ మీరు తీసుకోనందున మీకు దావా నోటీసును ఈ ప్రకటన ద్వారా ఇవ్వవలసినదిగా ఆర్డరు వేస్తూ ది. 22-10-2025 కి వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం 10-30 గం.లకు మీరు పై కోర్టులో స్వయంగా గానీ, మీ ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని తెలియచేయడమైనది.

వాయిదా : 22-10-2025

పి.తరుణ్‌కుమార్,
ఎ.కాశీవిశ్వనాథరాజు,
వాది తరపు అడ్వకేట్స్, తెనాలి.

ప్రకటన

మా క్లయింట్స్ 1) బొల్లేపల్లి ఇందిర, D/o. వెంకట కోటయ్య మరియు 2) చాపలమడుగు దుర్గాభవానీ, W/o. ఉమాశంకర్, R/o. 12/3 లైను, అరండల్ పేట, గుంటూరు, వారి తరపున తెలియచేయడం ఏమనగా:

పరుచూరి విష్ణువర్ధనరావు, S/o. లేటు శ్రీ చంద్రశేఖర రావు, ఆంధ్రజ్యోతి పేపరు గుంటూరు సిటీ వార్తలు పేజీ నెం. 9 ఆదివారం ది.28/09/2025న ఒక తప్పుడు ప్రకటన ఇవ్వటం జరిగినది. బొల్లేపల్లి ఇందిర చాపలమడుగు దుర్గాభవానికి దఖలు దస్తావేజు నెం. 13432/2024 ది. 23/08/2024న నల్లపాడు JSRO వారి కార్యాలయం నందు రిజిస్టర్ చేయడం అయినది. దాపలమడుగు దుర్గాభవానీ ఆ దఖలు దస్తావేజు ద్వారా దేవాన్ష్ ఇన్ఫ్రా యజమాని మునుకూరి వీరారెడ్డి, S/o. శ్రీనివాసరెడ్డి పేరు మీద GPA తో కూడిన డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ నెం.6606/2024 ది. 05/09/2024 న రిజిస్టర్ చేయడం జరిగినది. ఈ వ్యవహారం మొత్తం వారిద్దరి సమ్మతంతోనే జరిగినది. బొల్లేపల్లి ఇందిరను ఎవరు మోసం చేయలేదు. బొల్లేపల్లి ఇందిర ఆమె స్వబుద్ధితో దుర్గాభవానీ పేరు మీద దఖలు దస్తావేజు రిజిస్టర్ చేయటం జరిగినది. ఆ పిమ్మట దాపలమడుగు దుర్గాభవానీ దేవాన్ష్ ఇన్ఫ్రా యజమాని మునుకూరి వీరారెడ్డితో బహుళ అంతస్తులు నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నారు. పరుచూరి విష్ణు వర్ధనరావు బొల్లేపల్లి ఇందిర తల్లి శారద వద్ద గతంలో 80 లక్షలు నగదు తీసుకొని వెళ్లిపోయి మోసం చేసాడు, మరలా ఆ నగదు తిరిగి ఇవ్వలేదు. అప్పటి నుండి బొల్లేపల్లి ఇందిర కుటుంబానికి మరియు పరుచూరి విష్ణు వర్ధన రావు కుటుంబానికి అన్నీ సంబంధాలు తెగిపోయినవి. మరియు రాకపోకలు లేవు. పరుచూరి విష్ణు వర్ధన రావు పత్రిక ప్రకటనలో అవాస్తవాల ద్వార తప్పుడు ప్రచారం చేయుచున్నాడు. అతను చాపలమడుగు దుర్గాభవానీ మరియు ఆమె భర్త, మామ గారు మరియు ఇతరుల మీద అరండల్ పేట పోలీస్ స్టేషన్ లో FIR No. 264/2025 తప్పుడు కేసు పెట్టాడు. కాబట్టి ఈ ఆస్తిపై పరుచూరి విష్ణు వర్ధన రావుకి ఎటువంటి హక్కులు లేవు. బొల్లేపల్లి ఇందిర చాపలమడుగు దుర్గాభవానీ కూతురు విజితను రిజిస్టర్డ్ దత్తత తీసుకున్నారు. సదరు ఇందిరా గారు, చేపలమడుగు ఉమా శంకర్ మరియు దుర్గా భవాని అందరు కలసి ఉంటునారు, ఈ విషయాలు అన్నీ తెలిసి పరుచూరి విష్ణువర్ధనరావు కావాలని తప్పుడు పేపర్ ప్రకటన ఇచ్చాడు. ఆ పేపర్ ప్రకటనలోని విషయాలు పూర్తిగా అసత్యం. అతనిపై నా క్లయింట్స్ చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. ఈ డెవలప్మెంట్ అగ్రిమెంట్ కి ఎటువంటి ఆటంకాలు లేవు. ఈ ఆస్తి పై లావాదేవీలు జరుపుకొనుటకు చట్టరీత్య ఎటువంటి ఇబ్బందులు లేవు.

నర్రా శ్రీనివాసరావు,
వై. సుబ్బారెడ్డి,
అడ్వకేట్స్
ఋషి వ్యాలీ హోమ్స్, గుంటూరు.
ఫోన్ నెం. 9440441488.

CHANGE OF SURNAME

I, PATTAN KARIMULLA KHAN S/O.PATHAN AKBAR KHAN (Old Name), residing at D.No.14-4-85, Pothuru Vari Thota, 4th Line, Kothapeta, Guntur, Guntur District, Andhra Pradesh-522001. My Name has been changed to **PATHAN KARIMULLA KHAN S/O. PATHAN AKBAR KHAN (New name)**. Here after my name is known as **PATHAN KARIMULLA KHAN S/O.PATHAN AKBAR KHAN (New name).**

CHANGE OF SURNAME

I, PATTAN SHAKEELA KHANAM W/O.PATHAN KARIMULLA KHAN (Old Name), residing at D.No.14-4-85, Pothuru Vari Thota, 4th Line, Kothapeta, Guntur, Guntur District, Andhra Pradesh-522001. My Name has been changed to **PATHAN SHAKEELA KHANAM W/O.PATHAN KARIMULLA KHAN (New name)**, . Here after my name is known as **PATHAN SHAKEELA KHANAM W/O.PATHAN KARIMULLA KHAN (New name).**

ప్రకటన
మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E. P No. 60/25 IN OS No. 375/2021

బిట్వీన్:
శాఖమూరి రవిబాబు .... డి.హెచ్. ఆర్.
మధ్య
యలవర్తి అలివేలు మంగమ్మ వగైరాలు... జె.డి.ఆర్‌లు

1వ జెడిఆర్ : యలవర్తి అలివేలు మంగమ్మ, భర్త: గోపీచంద్, కేరాఫ్, గాలి వెంకటబాబు @ బాబీ, మెయిన్ రోడ్డు, కంచర్లపాలెం గ్రామం, తెనాలి మండలం, గుంటూరు జిల్లా

2వ జెడిఆర్ : యలవర్తి పూర్ణకుమారి, భర్త లేటు వెంకటకృష్ణ ప్రసాద్, డోర్ నెం. 20-5-2ఏ, రామలింగయ్య స్ట్రీట్, బోసురోడ్డు, సత్యనారాయణ పార్కు దగ్గర, తెనాలి, గుంటూరుజిల్లా,

3వ జెడిఆర్ : యలవర్తి లక్ష్మీసుధ, తండ్రి లేటు వెంకట కృష్ణప్రసాద్, డోర్ నెం. 20-5-2/ఏ, రామలింగయ్య స్ట్రీట్, బోస్ రోడ్డు, సత్యనారాయణ పార్కు దగ్గర, తెనాలి, గుంటూరు జిల్లా,

పై నెంబరు ఇ.పి.లో మీకు శ్రీ కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు పంపవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ 22-10-2025 తేదికి వాయిదా వేసి ఉన్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, వ్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనియెడల శ్రీ కోర్టువారిచే మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియ పరచటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది 22-10-2025

ఇట్లు
కమ్మెల దుర్గాప్రసాద్,
డిహెచ్‌ఆర్ తరపు న్యాయవాది,
తెనాలి, సెల్: 9849182078

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు పర్చూరు
OS.No : 1/2025

పోపూరి భావన మరియు ఇతరులు .... వాదులు
V/s
పోపూరి వెంకట రత్తయ్య మరియు ఇతరులు .... ప్రతివాదులు

To
D2) పోపూరి సామ్రాజ్యం W/o లేటు వెంకటేశ్వర్లు
D/o మునునూరి సీతారామయ్య
R/o కొలకలూరుగ్రామం చిన్నరథం సెంటర్ దగ్గర,
తెనాలి మండలం, గుంటూరు (జిల్లా).

పై నెంబరు గల దావాను మీపై దాఖలు చేసి మీకు ఎన్నిమార్లుదావాసమన్లు పంపినను చేరనందున ఈప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది ఏమనగా ది:07-10-2025 న ఉదయం 10:30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయం గా కానీ వకీలు ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమున దావాను విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా :07-10-2025 **ఇట్లు**
వెంగలశెట్టి తిరుమలరావు
న్యాయవాది, పర్చూరు

పింఛను పంపిణీలో జాప్యం - కలెక్టర్ సీరియస్

ప్రజాశక్తి - రాజుపాలెం

సామాజిక పింఛనును ఇంటి వద్ద ఇవ్వబోమని, సచివాలయం వద్దకు వచ్చి తీసుకోవాలని మండలంలోని అనుపాలెం గ్రామ సచివాలయ ఉద్యోగులు దండోరా వేయించారు. దీంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు మధ్యాహ్నం దాటినా పింఛను పంపిణీ చేయలేదనే సమాచారంతో డిప్యూటీ ఎంపీడీవో ముక్కంటి ఆ గ్రామానికి చేరుకుని ఉద్యోగుల తీరుపై ఆరా తీశారు. సచివాలయ ఉద్యోగులు నిరసన పేరుతో ఇలా చేశారని తెలిసి పల్నాడు కలెక్టర్ కృతిక శుక్లా సైతం సీరియస్ అయ్యారు. వెంటనే గ్రామానికి డిఎల్‌పిఒ చేరుకుని సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన ఎక్కడ చేయాలి? ఎప్పుడూ చేయాలి? పింఛనుదారులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సబబు అని నిలదీశారు. నిరసనకు, ఇళ్లవద్దకెళ్లి పింఛను ఇవ్వకపోవడానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. రెండు గంటలపాటు గ్రామంలోనే ఉన్న డిఎల్‌పిఒ దీనిపై కలెక్టర్‌కు నివేదించనున్నారు.

ప్రెసిడెంట్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న తిరుమలశెట్టి వెంకట్రావు

సొసైటీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - నకరికల్లు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కో-ఆపరేటివ్ సొసైటీల పాత్ర ఎంతో కీలకమని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. నకరికల్లు సొసైటీ ప్రెసిడెంట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. సొసైటీ ప్రెసిడెంట్‌గా తిరుమలశెట్టి వెంకట్రావు, సభ్యులుగా కరాలపాటి వలి, చేపూరి వెంకటేశ్వర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సొసైటీలోని ఒకాయిలను త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పథంలో నడిపించాలని చెప్పారు. కార్యక్రమంలో జిడిసిసి బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగోతు సౌరయ్య, ఎంపీపీ ఎం.అనురాధ, సర్పంచ్ పి.అంజమ్మ, పిఎసిఎస్ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

4న ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పట్టణంలోని ఆటో డ్రైవర్లతో బుధవారం ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆటో, క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల కోసం ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్ల సేవలో పథకం గురించి వివరించారు. ఈ నెల 4న డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటీ) ద్వారా నిధులు జమవుతాయని, ఈ సందర్భంగా భారీ ర్యాలీ చేయాలని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం రూ.10 వేలు, రూ.12 వేలు ఇచ్చిందని, కూటమి రూ.15 వేలకు పెంచిందని తెలిపారు. పల్నాడు జిల్లాలో 12 వేలమంది ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఉన్నారని, వీరిలో 10,500 మంది ఈ పథకానికి అర్హత సాధించారని, వీరికి రూ.15.75 కోట్లు జమ కానున్నాయని వివరించారు. నరసరావుపేట మండలంలో 4,500 మంది దరఖాస్తు చేసుకోగా, కొందరు డ్రైవింగ్ లైసెన్స్ అప్‌డేట్ సమస్యల కారణంగా అర్హత పొందలేదని, సమస్య పరిష్కారానికి సచివాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

జిల్లా ఆస్పత్రిని అభివృద్ధి చేస్తాం : పల్నాడు కలెక్టర్

పారిశుధ్యంపై పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిని సందర్శించి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం వద్ద అన్నా క్యాంటీన్ సందర్శించి ఆహార నాణ్యత, పారిశుధ్యంపై పరిశీలించారు. స్టేడియంను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. షాలెం నగర్‌లో మురుగు కాల్వలలో గడ్డి, పిచ్చి మొక్కలు, పూడిక ఉండటంతో తొలగింపునకు ఆదేశించారు. పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. బాపనయ్య నగర్ 11వ వార్డు సచివాలయాన్ని సందర్శించారు. పర్యటనలో భాగంగా జిఎస్‌టి తగ్గింపులపై ప్రజలకు వివరించడంతోపాటు ప్రజల నుండి అభిప్రాయాలు సేకరించారు.

యడ్లపాడు పాఠశాలపై గ్రామ కమిటీ వినతి

ప్రజాశక్తి - యడ్లపాడు

గ్రామంలో పాఠశాలను యడ్లపాడు కమిటీ ద్వారా 1952లో నిర్మించుకోగా దాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ముందుకొచ్చిన ఎఇఎల్‌సి నిర్లక్ష్యం చేసిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ మేరకు మండల కేంద్రమైన యడ్లపాడుకు బుధవారం వచ్చిన కలెక్టర్‌కు పాఠశాల సమస్యపై విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్థానికంగా విద్యాభివృద్ధి కోసం ఎఇఎల్‌సిని నమ్మి పాఠశాల నిర్వహణను మాత్రమే ఆ సంస్థకు అప్పగించామని, అయితే కొన్నేళ్లుగా బాగానే నిర్వహించిన తర్వాత నిర్లక్ష్యం చేసిందని, పాఠశాల మూతబడే స్థాయికి దిగజార్చిందని వివరించారు. దీనిపై ఆర్‌డిఒ మధులతను కలెక్టర్ పలు వివరాలు అడిగారు. సభ్యులు చెబుతున్న అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని, అపోహలేమీ పెట్టుకోవద్దని హామీనిచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కమిటీ సభ్యులు నూతలపాటి కాళిదాను, ముత్తవరపు

రామారావు, పోపూరి వెంకటరత్తయ్య, చల్లా విఘ్నేశ్వరరెడ్డి, పోపూరి రాఘవయ్య, పోపూరి వెంకయ్య, పోపూరి నాగేశ్వరరావు ఉన్నారు.

జీఎస్టీ కరపత్రాలు పంపిణీ

మండల కేంద్రమైన యడ్లపాడులో నిర్వహించిన జిఎస్‌టి అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి జిఎస్‌టి తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వస్తువుల ధరల తగ్గింపుతో సాధారణ కుటుంబాలు గణనీయమైన ఆదా చేసుకోవచ్చని చెప్పారు. పండగ కాలంలో ఈ ఆదా మరింత ఉపయోగపడుతుందన్నారు.

చెరువులన్నీ నింపండి

జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో నీటి సరఫరాకు సంబంధించిన చెరువులు సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో నింపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చెరువులు నింపడం, భూగర్భ జలాలు పెంపొందించడం అంశాలపై ఇరిగేషన్, భూగర్భ జల శాఖ, డ్వామా అధికారులతో నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్షించారు. భూగర్భ జలాలను సంరక్షించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంట కుంటల తవ్వకం, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, నీటి కుంటల నిర్మాణం, చెరువుల పూడిక తీత, చెరువుల అభివృద్ధి, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను నింపటం, వంటి సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలని చెప్పారు. ఉపాధి హామీ కింద ఇంకుడు గుంతలు, పంట కుంటలు నిర్మాణం చేపట్టాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ సూరజ్, డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి, మైనర్ ఇరిగేషన్ డిఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలేజీని పూర్తి చేయలేని వారు రాజధాని కడతారా?

- వైసిపి హయాంలో 75 శాతం పనులు
- అధికారంలోకి వచ్చాక వైద్య కళాశాలల స్వాధీనం : వైసిపి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వైసిపి ప్రభుత్వం తలపెట్టిన 17 మెడికల్ కళాశాలను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, అందులో భాగమే మెడికల్ కళాశాలలను పిపిపికి అప్పజెప్పేందుకు పూనుకోవడమని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలా అన్నారు. పిడుగురాళ్లలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ భవనాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. కొంత బడ్జెట్ కేటాయిస్తే 10 మెడికల్ కాలేజీలూ పూర్తవుతాయని, అయితే అందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని అన్నారు. కాలేజీలను పూర్తి చేయలేనివారు రూ.లక్ష కోట్లతో రాజధాని నిర్మాణం ఎలా చేస్తుందని ప్రశ్నించారు. పిడుగురాళ్లలోని కాలేజీ వైసిపి ప్రభుత్వమే 75 శాతం పూర్తి చేసిందని, కూటమి అధికారంలోకి వచ్చాక నిర్మాణమే ఆగిందని అన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పజెప్పకుండా పోరాడతామని, ఎవరైనా కాంట్రాక్టుకు తీసుకుంటే జగన్ సిఎం అయ్యాక ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు.

వైసిపి హయాంలో 28 శాతమే పనులు : ఎమ్మెల్యే

పల్నాడులో దేవాలయాలు కేంద్రంగా పర్యాటకాభివృద్ధి

పజాశక్తి-పిడుగురాళ్ల

పల్నాడును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం పింఛన్ల పంపిణీ అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చారిత్రాత్మక దేవాలయాలున్నాయని, వాటి అభివృద్ధితోపాటు ప్రత్యేకంగా సత్రాలు ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. కృష్ణా నదికి అనుకొని ఉన్న ప్రాంతంలో కాటేజ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో రానున్న కృష్ణా పుష్కరాలనూ ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతో గత వైసిపి ప్రభుత్వం మెడికల్ కాలేజీని 28 శాతమే పూర్తి చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, కూటమి అధికారంలోకి వచ్చాక 58 శాతం పనులు పూర్తి చేశామని, త్వరలోనే మిగిలిన పనులు పూర్తి చేస్తామని వివరించారు. పిడుగురాళ్లలో కాలుష్య సమస్యను త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని, పార్కునూ నిర్మిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో 1400 ఎకరాల భూములను ఆక్రమించిన వారిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. వాటర్ గ్రిడ్‌కు టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సుబ్బారావు, టిడిపి పట్టణ అధ్యక్షులు పిల్లి చెన్నారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సొంత భవనంలో నుండి అద్దెభవనం లోకా..?

బుచ్చిపాపన్నపాలెం సొసైటి కార్యాలయాన్ని మార్చొద్దని కలెక్టర్‌కు వైసిపి వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులకు, గ్రామాల ప్రజలకు చేరువలో అందుబాటులో ఉన్న బుచ్చిపాపన్నపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసిఎస్)ను కేవలం రాజకీయ జోక్యంతో మార్చడం సరికాదని వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెం గ్రామ సొసైటీని గోగులపాడుకు మార్చడానికి నిరసిస్తూ నరసరావుపేట కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సొంత భవనాలున్న పిఎసిఎస్‌లు అదే భవనంలో కొనసాగాలని గతంలో టిడిపి ప్రవేశపెట్టిన జీవోను ఆ పార్టీ ప్రభుత్వమే తుంగలో తొక్కిందని అన్నారు. బుచ్చిపాపన్నపాలెం తన స్వగ్రామం కావడం, వైసిపి బలంగా ఉండడం వంటి కారణాల నేపథ్యంలో టిడిపి కూటమి నాయకులు మారుస్తున్నారని విమర్శించారు. రామిరెడ్డిపాలెం, గోగులపాడు, ఆరేపల్లి గ్రామాల రైతులకు, ప్రజలకు అందుబాటులో 3 దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన బుచ్చిపాపన్నపాలెంలోని సొసైటీని రాజకీయ దుర్దేశంతో గోగులపాడు గ్రామంలోని అద్దె భవనంలోకి మారుస్తున్నారని చెప్పారు. ఇటీవల సొసైటీ అధ్యక్షులుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన టిడిపి కూటమి నాయకులు సొసైటీ కార్యదర్శిపై ఒత్తిడి చేసి కంప్యూటర్‌లను, ఫర్నిచర్, సామగ్రిని గోగులపాడు అద్దె

భవనంలోకి తరలించారన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అద్దె భవనాలలో ఉన్న సొసైటీ లను సొంత భవనంలోకి మార్చాలని కమిషనర్ ఆఫ్ కో-ఆపరేటివ్ అండ్ రిజిస్ట్రార్ కో-ఆపరేటివ్ సొసైటీ విడుదల చేసిన ఆదేశాలకు విరుద్ధంగా ఇక్కడ వ్యవహరిస్తున్నాని తెలిపారు. సొసైటీని యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి రొంపిచర్ల మండల అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, నాయకులు బి.భాస్కర్‌రెడ్డి, పి.వెంకట్రావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు లేవని వాపోతున్న ప్రజలు, అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

సౌకర్యాలు లేక పుష్కర కాలనీ వాసుల ఇక్కట్లు

- ఇళ్లల్లోకి పాములు - మండ్రగబ్బలు
- మౌలిక సౌకర్యాలు నిల్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

అధ్వానంగా ఉన్న మంచినీటి ట్యాంకు పరిసరాలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమ ఇళ్లలోకి పాములు – మండ్రగబ్బలు లాంటి విష కీటకాలు వస్తున్నాయని, ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియక ఆందోళనతో జీవిస్తున్నామని సీతానగరం పుష్కర కాలనీవాసులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కృష్ణా పుష్కరాలు సందర్భంగా సీతానగరంలో నివాసం ఉంటున్న పేదల ఇల్లు తొలగించి, ఉండవల్లి సమీపంలోని గుంటూరు ఛానల్ ఎడ్ రెగ్యులేటర్ వద్ద 167 మందికి తాత్కాలికంగా 45 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించారు. పేదల కు ఆమాత్రమైన గూడుదక్కటానికి, నాటినుండి నేటిదాకా సిపిఎం తమకు అండదండలు అందజేసిందని స్థానికులు చెబుతున్నారు. సిపిఎం కృషి లేకపోతే తాము రోడ్డు పాలు అయ్యేవారమని పేదలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పుష్కర కాలనీగా పేరుగాంచిన ఇక్కడ నివసిస్తున్న కుటుంబాలకు మౌలిక సౌకర్యాలు మాత్రం మఅగ్యంగానే ఉన్నాయి. ఎప్పుడు ఎటు నుంచి ఏ విష కీటకాలు వస్తాయోనని భయాందోళనలతో జీవిస్తున్నామని పేదలు చెప్పారు. బాత్రూంలోకి పాములు, మండ్రగబ్బలు, తేళ్లు ఇలాంటి విష కీటకాలు నిత్యం సంచరిస్తున్నాయని వాపోతున్నారు. కాలనీ ఏర్పడి నేటికీ 10 సంవత్సరాలు అవుతున్న సరేనా రోడ్లు నిర్మించలేదు. కొన్ని బజార్లలో వీధి దీపాలు వెలగడం లేదు. పెద్ద ఎత్తున పెరిగిన పిచ్చి చెట్లతో ఇళ్ళ ముందు రోడ్లు కుచించుకుపోయాయి. ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు లు పెద్ద ఎత్తున అడవి లాగా పిచ్చి చెట్లు మొలిసాయి. విష కీటకాలకు ఇవి ఆవాసాలుగా మారాయి. రాత్రి అయితే దోమల స్వైర విహారం గురించి చెప్పాల్సిన పనిలేదని పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమ కాటు వల్ల కాళ్లు వాసి బోధ కాలుగా మారుతున్నాయని మహిళలు వాపోతున్నారు. రోడ్లు సరిగా లేకపోవడంతో ఇళ్ల ముందు నీరు నిలబడి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. సైడ్ కాలవలు లేకపోవడంతో మురుగుతో సావాసం చేయవలసి వస్తుందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 5 మీటర్ల ఎత్తున ఏర్పాటు చేయాల్సిన వాటర్ ట్యాంక్ భూమి మీద ఏర్పాటు చేయటంతో ఇళ్ళ ముందుకు నీళ్లు రావడంలేదని స్థానికులు తెలిపారు. ట్యాంకు దగ్గరకెళ్ళి పట్టుకుందామన్న దాని చుట్టూ అపరిశుభ్రత వాతావరణం నెలకొందని చెప్పారు. వాటర్ ట్యాంక్ ఎత్తు లో లేకపోవడంతో, నీటి దారగూడ సన్నగా వస్తుందని చెప్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చిన మురుగు పోయే దారి లేక, ఇళ్ల మధ్యనే ప్లాస్టిక్ వ్యర్థాలు తో కూడిన మురుగు నిలబడి దుర్వాసన వెదజల్లుతుందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ళ ముందు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన కరెంటు స్తంభం వల్ల రాకపోకలు సాగించ డానికి ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. తాను అధికారంలోకి వస్తే సంవత్సరంలోపు మీరు ఉంటున్న ఇళ్ల స్థలాలకు పట్టాలిస్తామని చెప్పిన మంత్రి నారా లోకేష్ హామీ నేటికీ నెరవేరలేదని అసంతృప్తివ్యక్తం చేస్తున్నారు. సోమవారం మంగళగిరిలో జరిగే గ్రీవెన్స్‌లో, ఎంటీఎంసీ కార్యాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు ఇవ్వటానికి పేదలు సన్నద్ధమవుతున్నారు.

సిపిఎం నాయకులు పర్యటన

పుష్కర కాలనీలో పేదలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకోవటానికి సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు కె.మేరీ, డి.కోదండరామయ్య బుధవారం పర్యటించారు. పదేళ్ల క్రితం సిపిఎంతో పాటు అన్ని రాజకీయ పార్టీలు చేసిన ఆందోళనతో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన హామీ పాలకులు నేటికీ నెరవేర్చలేదని నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించడంతోపాటు, కాళీ ప్లాట్లు పెద్ద ఎత్తున పెరిగిన చెత్తను తొలగించాలని, వాటర్ ట్యాంక్ ఎత్తులో నిర్మించి, మంచినీరు సక్రమంగా అందించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. విష జ్వరాలు ప్రభలుతున్నందున ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి మందులు సరఫరా చేయాలని కోరారు. సోమవారం మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌లో సమస్యలు పరిష్కరించమని అర్జీలు అందజేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

విష సర్పాలతో జన్మదిన గండం : చిలకలపూడి వెంకటేశ్వరమ్మ

బాత్రూంలోకి విష సర్పాలు వస్తున్నాయి. వయసు పై పెట్టడంతో కళ్ళు సరిగ్గా కానరావడం లేదు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాము.

లోకేష్ హామీ నెరవేర లేదు : సిహెచ్ వీరాంజనేయులు

మంత్రి నారా లోకేష్ ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు కాలనీవాసులు అందరికీ పట్టాలిస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. వెంటనే తమకు శాశ్వత ఇళ్ల స్థలాలు ఇచ్చి పట్టాలిచ్చి మంత్రి ఇచ్చిన హామీని లబెట్టుకోవాలి.

దోమల వ్యాప్తి అరికట్టాలి : గేల్లా పద్మ

కాలనీలో దోమల వ్యాప్తి అరికట్టాలి. దోమ కాటుతో విష జ్వరాలు ప్రబులుతున్నాయి. కాళ్లు వాపులు వచ్చి బోదకాలుగా మారుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించాలి.

రోడ్లు వేయండి : కొక్కిలిగడ్డ నాగరాజు

10 సంవత్సరాల నుండి పుష్కర కాలనీలో రోడ్లు లేకుండానే నడుస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు ఇళ్ల ముందు సిసి రోడ్లు వేయాలి.

రైతులను ముంచిన వరద

వరద నీటిలో మునిగి ఉన్న మినుము అరటి పసుపు తోటలు



ప్రజాశక్తి - దుగ్గిరాల

గత నాలుగు రోజుల నుండి కఅష్ణ నదికి స్థిరంగా కొనసాగుతున్న వరద వలన మండల పరిధిలోని లంక ప్రాంత%శీ% లోని చేలు వరదనీటిలో మునిగి ఉన్నాయి. ఈ ప్రాంతంలో అత్యధికంగా సాగుతున్న మినుము అరటి కూరగాయలతో ట లకు తీవ్ర నష్టం వాటిలే ప్రమాదం ఉన్నదని రైతులు తెలిపారు. మినప పైరు వేళ్ళు రెండు రోజులకే కుళ్ళిపోతాయని తెలిపారు. అరటి పిలకల మొవుల్లో నీరు నిల్వ ఉన్నట్లయితే అవి కూడా కుళ్ళిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. పసుపు కంద చీమ దుంపలు కూడా కుళ్లిపోతాయన్నారు. వరదనీరు స్థిరంగా కొనసాగుతుండటంతో రైతులు పంటల మీద ఆశలు వదులుకొని తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. నీరు బయటకు వెళ్లే మార్గం లేక నిస్సహాయ పరిస్థితుల్లో కొట్టుమిట్టుగులాడుతున్నారు. అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడులు వరద నీళ్లకు కొట్టుకుపోతామని ఆందోళన చెందుతున్నారు. పంటలకు నష్టం చాలా ఎక్కువగా ఉంటుందని ప్రభుత్వం వెంటనే సహాయ సహకారాలు అందించాలని కోరుకుంటున్నారు .ప్రభుత్వం ఎ టువంటి సహాయ సహకారాలు అందిస్తుందో వేచి చూడవలసి ఉన్నది నష్టం చాలా ఎక్కువగానే ఉంటుందనీ ఎంత ఉంటుందనేది ఇప్పుడే అంచనా వేయటం కష్టమని తెలిపారు

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి నియోజకవర్గంలో కాజ గ్రామంలో అర్హులైన ఇల్లులేని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, అలాగే వివిధ పోరంబోకు భూములో ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, మురుగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. కాజ గ్రామంలో సిపిఎం సభ్యుల విస్తృత సమావేశం కారుమూరు గోపాలరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని ఎన్నికలకు ముందు లోకేష్ హామీ ఇచ్చారని ఎన్నికల అనంతరం ఆ ఊసే ఎత్తటం లేదని విమర్శించారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం వల్ల కొద్దిపాటి వర్షాలకి డ్రైనేజీలు పొంగిపొర్లు తున్నాయి. ముఖ్యంగా టోల్ ప్లాజా వద్ద డ్రైనేజీలు సరిగా లేక పైనుంచి వచ్చిన వరద నీరు కాజ గ్రామంలోకి ప్రవహించి లోతట్టు ప్రాంతాల ఇళ్లల్లోకి వస్తున్నాయని స్థానికంగా ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని , దీనికి తోడు దోమలు విపరీతంగా పెరిగి విష జ్వరాలు సోకుతున్నాయని తెలిపారు .అలాగే గ్రామంలో పంటకాలవల గట్లు పటిష్టంగా లేని కారణంగా గండ్లు పడి వరద నీరు పంట పొలాలని మునుగుతున్నాయి కావున అధికారులు కాలవల్లోని గుర్రపు డెక్కను తొలగించి కాలవ గట్లను పటిష్ట పరచాలన్నారు. ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల నాలుగో తేదీ నుండి గ్రామంలో నిర్వహించి పాదయాత్రలో ఇళ్లు లేని వారిని గుర్తించి వ్యక్తిగత ఇంటి స్థలాల అర్జీలు పెట్టించాలని 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఇళ్ల స్థలాల కొరకు జరిగే రిలే దీక్షలను, 17వ తేదీన జరిగే నియోజకవర్గ స్థాయి మంగళగిరి ఎంటిఎంసి కార్యాలయం వద్ద జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం మంగళగిరి రూరల్ మండల కమిటీ కార్యదర్శి వుద్దంటి దుర్గారావు మండల కమిటీ సభ్యురాలు భీమిరెడ్డి కోటేశ్వరి, సింహాద్రి సుమ సీనియర్ నాయకులు ఈదా నాగేంద్రరెడ్డి, తమ్మ ప్రసాద్ రెడ్డి,ఈదా బ్రహ్మారెడ్డి, భీమిరెడ్డి పేరెడ్డి, మేడ శివయ్య, గాదె మాధవరెడ్డి, ఈదా రాజా చంద్రశేఖర్ రెడ్డి, భీమిరెడ్డి శివారెడ్డి పాల్గొన్నారు.

వరద నీటిలో నానుతున్న పసుపు పంట

జలదిగ్బంధంలో లంక గ్రామాలు

ప్రజాశక్తి - కొల్లిపర

నాలుగు రోజులుగా కృష్ణా పరీవాహ ప్రాంతాలను లంక గ్రామాలను చుట్టుముట్టింది. వరద ముంపు ఇంకా వీడలేదు. భారీ వరద ముంపు అన్నదాతల ఆశలను ఆవిరిచేసింది. ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టామని ఒకసారిగా వచ్చిన వరద అప్పుల ఊపులోకి నెట్టిందని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలోని లంక గ్రామాలైన అనవరపులంక బమ్మ వారి పాలెం కొత్తూరు లంక కృష్ణా పరీవాహక ప్రాంతాలైన వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర కట్టకు ఆవలివైపు మెట్ట భూములలో భారీగా వరద నీరు చేరింది. అరటి పసుపు, కంద తమలపాకు కూరగాయ తోటలు పూర్తిస్థాయిలో నష్టపో యాయి. ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అత్యవసర సేవలను అందిస్తున్నారు. మండల పరిధిలో సుమారు 408 హెక్టార్ల మేర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

302వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 302వ రోజుకు చేరుకున్నారు. దీక్షలలో సిహెచ్,పిచ్చయ్య, బొక్క జోజప్ప, రావూరి ఇశ్రాయిల్, యహెూషువ, వై.సాంబశివరావు కూర్చున్నారు. దీక్షలను కార్మికులు కె.ఆదినారాయణ, షేక్ సుభాని, డి.నాగేశ్వరావు ప్రారంభించారు.

బంగారు కుటుంబాలతో ఎమ్మెల్యే దంపతులు

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చిన పీ-4లో భాగంగా దత్తత తీసుకున్న బంగారు కుటుంబాల మధ్య ఎమ్మెల్యే ఆంజనేయులు దంపతులు దసరా వేడుకలు ఘనంగా చేసుకున్నారు. నూజెండ్ల మండలం కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలోని 60 బంగారు కుటంబాలకు శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేసి మిఠాయిలు అందజేశారు. అందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లా డిన ఆంజనేయులు పేదరికం నిర్మూలన కేవలం ప్రభుత్వ పథకాల ద్వారానే కాదు, సామాజిక భాగస్వామ్యం ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు జన్మభూమి రుణం కొంత తీర్చుకోవడానికి బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నామని, వారికి తోడుగా నిలబడటం గౌరవం, మంచి చేయడానికి దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తున్నామన్నారు. ప్రజలతో కలిసి వేడుక జరుపుకోవడం ద్వారానే పండుగ ఆనందోత్సాహాలు మరింత రెట్టింపు అవుతాయని పేర్కొన్నారు. జీవీ సతీమణి లీలావతి మాట్లాడుతూ బంగారు కుటుంబాలు సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించాలని, వారి పిల్లలు చదువులో, యువత ఉపాధిలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీవీ దంపతులు

రచయిత కమలారామ్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - వినుకొండ

జాషువా స్మారక కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో రచ యిత, కవిరత్న, నంది అవార్డు గ్రహీత, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు, జాషువా సమాఖ్య వేదిక గౌరవ అధ్యక్షులు కమలా రామ్‌ను డాక్టరేట్ అవార్డు-2025కు ఎంపిక చేసినట్లు సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పెద్దేటి యోహాన్ తెలిపారు. ఈనెల 5వ తేదీ హైదరాబాదులోని రవీంద్ర భారతి ఆడిటోరి యంలో ముఖ్య అతిథులు చేతుల మీదుగా, నాలుగు దశాబ్దాలుగా సామాజిక, సాహితీ సేవలందించిన వారికి జాతీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవార్డు ప్రధానం చేస్తామని తెలిపారు. డాక్టరేట్ ఇస్తున్నందుకు వారికి కమలారామ్ ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే దంపతులను సన్మానించిన ఆలయ పండితులు

దసరా శుభాలు తీసుకురావాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ

అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ వినుకొండ నియోజకవర్గం, రాష్ట్ర ప్రజలపై మెండుగా ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సౌఖ్యం, సాఫల్యం నిండాలని, ఈ దసరా శరన్నవ రాత్రులు శుభాలు తీసుకురావాలన్నదే తన ఆకాంక్ష అని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా వినుకొండ పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆంజనేయులు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యువతకు శిక్షణ

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక ఎస్ కేబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్ డెవ లప్‌మెంట్ , ట్రైనింగ్, రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతకు ఉచిత శిక్షణ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానంటూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, జిల్లా నైపుణ్యాధికారి జీ.తమ్మాజీ రావు, కళాశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి కుమారి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల ఆరవ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రమావత్ కిరణ్ నాయక్ 7842747682, నెంబరును సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ షాక్ తగిలి గేదెమృతి చెందిందని పట్టణానికి చెందిన కిషోర్ అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని కళ్ళం టౌన్‌షిప్‌కు చెందిన కిషోర్ మూడు నెలలు కిందట విద్యుత్ తీగలు తెగిపోయాయని విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. బుధవారం తనకు చెందిన గేదె విద్యుత్ తీగెలు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబ పోషణకు ఎంతో ఆసరాగా ఉండేదని చెప్పారు. రూ.లక్షా 10 వేలు వెచ్చించి గేదెను కొనుగోలు చేశానని అన్నారు. ఈ విషయంపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

మృతి చెందిన గేదెను చూపుతున్న కిషోర్

పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

సామాజిక పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ పండుగ వాతావరణంలో జరిగింది. తెల్లవారుజాము నుంచే ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్లను అందజేశారు.

రాజుపాలెం : టీడీపీ సీనియర్ నేత, మండల కాపు సంఘ నాయకులు పులిబండ్ల సాంబ శివరావు రాజుపాలెం మండల కేంద్రంలో కూటమి నేతలతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. జెట్టి కోటేశ్వరరావు, చొక్కాగాలయ్య, పెద్దింటి శ్రీనివాసరావు,ఎల్.బ్రహ్మయ్య, సి.బాబు,వై.వెంకట్రావు, సి.బుల్లెబ్బాయి, జె.సోమయ్య,సుభాష్, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

కారంపూడి : కారంపూడి మండలంలోని ఇనుపరాజు పాల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పాటు స్పౌజ్ పింఛన్లను టీడీపీ మండల అధ్యక్షులు గోళ్ళ సురేష్ యాదవ్ పాల్గొని పంపిణీ చేసారు.

వెల్దుర్తి : మండల కేంద్రమైన వెల్దుర్తిలోయువ నాయకులు జూల కంటి అక్కిరెడ్డి పంపిణీ చేశారు. వెల్దుర్తి మాజీ సర్పంచ్ కేశి రెడ్డి వెంకటరెడ్డి, జూలకంటి పెద్ద వెంకటరెడ్డి, జూల కంటి లక్ష్మారెడ్డి, కేశిరెడ్డి హనిమిరెడ్డి, అలావుల శ్రీనివాసరెడ్డి, పులుసు వీరారెడ్డి, గురవారెడ్డి, కోట్ల శ్రీనివాసరెడ్డి, పులుసు వేమారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినుకొండ : వినుకొండ 10వ వార్డు ఏబీఎం కాంపౌండ్ లో చీఫ్‌విప్ జీవీ, గుంటూరు జిల్లా డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట : పట్టణంలోని 28, 29 వార్డులు, నాదెండ్ల మండలం సాతులూరు ప్రత్తిపాటి పుల్లారావు పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివ రావు, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, నాదెండ్ల మండల అధ్యక్షులు బి.సత్యనారాయణ, రూరల్ మండలాధ్యక్షులు జె. మదన్‌మోహన్, యడ్లపాడు మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, ప్రధాన కార్యదర్శి ఎం.రవి, మున్సిపల్ కమిషనర్ పతిశ్రీహరి పాల్గొన్నారు.

విజయపురిసౌత్ : రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారునాయక్ అచ్చమ్మకుంట, లచ్చంబాయి గ్రామాల్లో పింఛన్లను, నూతన స్మార్ట్‌రేషన్ కార్డులను పంపి ణీ చేశారు. సర్పంచ్ లక్ష్మయ్య, పంచాయితీ సెక్రటరీ కోటేశ్వరరావు, శంకర్‌నాయక్, దేవలానాయక్, రాంసింగ్ పాల్గొన్నారు.

సూపర్ జిఎస్‌టి సేవింగ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - ముప్పాళ్ల

మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని నార్నెపాడు గ్రామంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ నూతన జీఎస్టీ విధానంతో వివిధ రకాల వ్యవసాయ యంత్ర పరికరాలపై జీఎస్టీ తగ్గిందన్నారు. ముప్పాళ్ల పిఎసియస్ ఛైర్ పర్సన్ జెట్టి నాగమల్లేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కూరపాటి ప్రభాకర్‌రావు, వ్యవసాయ విస్తరణాధికారి ఎన్.శేషుబాబు, పంచాయతీ సెక్రటరీ మౌనిక, విలేజ్ అగ్రిఅసిస్టెంట్ ఫిలిప్ రైతులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లి మండలంలోని ధూళిపాళ్ల, ఫణిదం గ్రామాల్లో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ.వెంకట్రావు పాల్గొన్నారు. సత్తెనపల్లి ఉద్యాన అధికారి ఎన్.సురేష్ దూళిపాళ్ల గ్రామనాయకులు కేదార్నాథ్, ఫణిదం గ్రామమాజీ సర్పంచ్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఫణిదంగ్రామసొసైటీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు గ్రామ నాయకులు కాళిదాసు, రైతు భరోసాకేంద్రం సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యడ్లపాడు : మండలంలోని కారుచోల గ్రామంలో జిఎస్‌టిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయాధికారి ఏ.హరిప్రసాద్ మాట్లాడారు. పార్టీ అధ్యక్షులు వెంకట కోటయ్య, పంచాయతీ సెక్రటరీ పి. నాగేశ్వరరావు, ఏ ఈ ఓ జీవన్ నాయక్, పశుసంవర్ధక శాఖ సహాయకురాలు మోహన శ్రీలక్ష్మి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఈపూరు : వ్యవసాయ అవసరాలకు వినియోగించే యంత్రాలు, పరికరాలపై కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జిఎస్టి రైతులకు లాభదాయకమని ఏఓ ఆర్ రామారావు అన్నారు. మండలంలోని కొండ్రముట్ల రైతు సేవా కేంద్రంలో జిఎస్టి సూపర్ సేవింగ్స్ పై రైతులకు అవగాహన కల్పించారు.పశు వైద్యాధికారి గోపాల్, గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ హుస్సేన్ వలి ఉన్నారు.

మాచర్ల : మండల పరిధిలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో సూపర్ జిఎస్టి, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు, వ్యవసాయ శాఖ అధికారి డి.పాపకుమారి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలం లోని గన్నవరం రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ పరికర ములు, ట్రాక్టరు, విడి భాగాల పాత జీఎస్టీ స్లాబ్స్ నుండి ఇపుడు తక్కువ రేటుకు అనగా 5శాతం జీఎస్టీతో అందు బాటు లో ఉన్నాయని, ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించి రైతులకు వివరించారు.

పిడుగురాళ్ళ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన జిఎస్టీ 2.0తగ్గింపుపై రైతులకు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించామని సేల్స్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ నారాయణ శాస్త్రి తెలిపారు. మండల, పట్టణంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు, ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏడిఏ శ్రీకృష్ణ దేవారాయలు, మండల వ్యవసాయ అధికారి సంధ్యారాణి,జిఎస్టీ నోడల్ అధికారి పీటర్ బాబు పాల్గొన్నారు.

ధూళిపాళ్లలో జీఎస్టీ పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ప్రజాశక్తి-ఈపూరు

గోపువారిపాలెం గ్రామంలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన విద్యుత్ స్తంభాలను బుధవారం విద్యుత్ శాఖ సిబ్బంది ఏర్పాటు చేయగా కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి గోనుగుంట్ల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారడంతోపాటు విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయన్నారు. సమస్యను ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లడంతో విద్యుత శాఖ అధికారులు తొమ్మిది విద్యుత్ స్తంభాలను మంజూరు చేశారన్నారు.నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. టిడిపి పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, ఈపూరు సొసైటీపర్సన్ ఇంచార్జ్ వి.హనుమయ్య, పి మల్లయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ చేసిన ఫౌండేషన్ సభ్యులు

ప్రపంచ వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి - యడ్లపాడు

అక్టోబర్ 1వ తేదీన ప్రపంచ వృద్ధుల దినోత్సవం జరుపుకుంటారు. దీనిని ఐక్యరాజ్యసమితి 1990 డిసెంబర్ 14 వ తేదీ ప్రకటించింది వృద్ధాప్యంతో ముడిపడి ఉన్న సమస్యలపై అవగాహన అక్టోబర్ 1 వతేదీ సీనియర్ సిటిజన్ అనే పదం కూడా ఇదే సదస్సులో 2020వ సంవత్సరం మొదటిసారిగా వాడటం జరిగింది. ప్రపంచ వృద్ధుల దినోత్సవం మొదటిసారిగా 1991 వ సంవత్సరం అక్టోబర్ 1 వ తేదీ జరుపుకున్నారు. అందులో భాగంగా నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ వారు వృద్ధులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం పండ్లు వృద్ధులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ అధ్యక్షురాలు సువర్ణకుమారి, ఉపాధ్యక్షుడు ఏ.ప్రసాద్‌రావు తిమ్మాపురం కొత్తపాలెంకాలనీ వృద్ధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక వివేకానంద సేవాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో రమేష్ మాట్లాడుతూ వయోవృద్ధులకు అనేక చట్టాలు అండగా ఉన్నాయని, ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందకపోయినా న్యాయసేవ కమిటీ వారికి తెలియజేసిన, వారికి అండగా నిలుస్తారని తెలిపారు. ఎవరికైనా భోజన, ఆరోగ్య సమస్యలు ఉంటే స్వామి వివేకానంద ఆశ్రమంలో చేరవచ్చుననీ, వారికి మూడు పూటలా భోజనం వైద్య సహాయం బట్టలు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ లాయర్ పి.అనిల్ పాల్గొన్నారు.

మానసిక వికలాంగురాలు మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పురుగుమందు తాగి మానసిక వికలాంగురాలు మృతి చెందింది ఈ సంఘటన సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో మంగళవారం జరిగింది. కొర్లకుంట వెంకట త్రివేణి (23) పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.కుటుంబ సభ్యులు సత్తెనపల్లి ప్రైవేట్ హాస్పటల్ తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. గుంటూరులో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలు తండ్రి కొర్లకుంట వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడ్కో గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని టిడ్కో గృహాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. పెన్షన్ల పంపిణీ చేయడానికి బుధవారం విచ్చేసిన కలెక్టరుకు తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించుకున్నారు. మూడేళ్ల నుండి టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టికి తీసుకువచ్చారు. ఎస్ టి పి వద్ద రోడ్డు వేసి, లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. రాత్రి 7 గంటల తర్వాత బయటకు రావడానికి భయమేస్తుందని వాపోయారు. పెద్ద పెద్ద విష సర్పాలు తిరుగుతున్నాయని అందు వలన భయపడుతున్నామని తెలిపారు. సొంతంగా తామే లైట్లు ఏర్పాటు చేసుకొని ఉంటున్నామని అన్నారు. వర్షం పడితే ఇళ్లల్లోకి నీళ్లు వస్తున్నాయని వాపోయారు. ఎస్ టి బి వద్ద సానిటరీ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో డ్రైనేజీ పొర్లి బయటకు వస్తుందని వాపోయారు దీనివలన దుర్వాసన కూడా వస్తుందని చెప్పారు. గృహాలు అన్నిటి కలిపి డ్రైనేజీ వ్యవస్థ ఏ విధంగా ఏర్పాటు చేసి ఉంటారో తెలియక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అనేక పర్యాయములు కార్పొరేషన్ అధికారులు దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదని కలెక్టర్ వద్ద వాపోయారు. పైపులైన్లు ఏ విధంగా వేశారో కూడా అర్థం కావడం లేదని అన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా, ప్రస్తుతం డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, అవి పూర్తయితే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. కోటి రూపాయలతో నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు.

కలెక్టర్‌కు సమస్యలు తెలుపుతున్న స్థానికులు

పద్మశాలీయ సేవా సంఘం అధ్యక్షులుగా మునగపాటి ఎన్నిక..

ప్రజాశక్తి - మంగళగిరి

పాత మంగళగిరి పద్మశాలీయ బహుత్తమ సేవా సంఘం (కళ్యాణ మండపం) అధ్యక్షులుగా మునగపాటి వెంకట మారుతి రావు ఎన్నికయ్యారు. బుధవారం కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా మునగాల దుర్గాప్రసాద్, కోశాధికారిగా మాచర్ల నాగేశ్వరరావు, మరో 40 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికైన వారందరినీ ఈ సందర్భంగా సన్మానించారు.

కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆర్థిక వనరులు లేకపోయినా ప్రజా అభివృద్ధి, సంక్షేమం కోసం పరుగులు పెడుతున్న కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన సామాజిక బాధ్యత ప్రజలపై ఉందని కృష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 30వ వార్డు అమరావతి ప్లాట్స్‌లో లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రతి నెల ఒకటో తారీఖున లబ్ధిదారులకు టంచనుగా పింఛను అందిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్పర్సన్ కత్తెర హెని క్రిస్టినా తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్, వార్డు కౌన్సిలర్ కొమరాబత్తిన జయపాల్ పాల్గొన్నారు.

తాగునీరు సురక్షితమే : ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల స్థాయిలోని వాటర్ ప్లాంట్లలో లభిస్తున్న నీరు, వాటర్ స్కీముల నుండి సరఫరా చేస్తున్న త్రాగునీరు సురక్షిత మైనవిగా రిపోర్ట్స్ వచ్చాయని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వి.వేణు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం అధికారులతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు జిల్లా స్థాయిలో విస్తృతంగా వ్యాపిస్తున్న జ్వరాల దృష్ట్యా జిల్లా అధికారుల ఉత్తర్వుల మేరకు మండల స్థాయిలోని 21 వాటర్ ప్లాంట్ల నుండి మరియు వాటర్ స్కీంలో నుండి గత నెల 20వ తేదీన శాంపిల్స్ సేకరించినట్లు తెలిపారు. వాటర్ ప్లాంట్ల నుండి సేకరించిన శాంపిల్స్ పీహెచ్ ల్యాబ్ మరియు మెడికల్ కాలేజీ గుంటూరు కు పంపించామని వాటర్ స్కీంల నుండి సేకరించిన శాంపిల్స్ తెనాలి డబ్ల్యు క్యు ఎం ల్యాబ్‌కు పంపించగా అన్ని సురక్షితమైనవిగా రిపోర్ట్స్ వచ్చాయన్నారు. నీళ్లలో ఎటువంటి బ్యాక్టీరియా గాని కలుష్యం గాని లేవని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలుగా కాచి చల్లార్చి వడగట్టిన నీరు తాగాలని ప్రజలకు సలహా ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి జవహర్లాల్ నెహ్రూ ఏపీఎం జి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ల్యాబ్ కు పంపించిన తాగునీరు శాంపిల్స్

జిల్లా వైద్యశాలకు మార్చురీ వ్యాన్ వితరణ

ప్రజాశక్తి - తెనాలి

తెనాలి జిల్లా వైద్యశాలకు హార్వెస్ట్ ఇండియా సంస్థ మార్చురీ వ్యాన్ ను బహూకరించారు. సంస్థ అధినేత, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా సంస్థ మేనేజర్ సుద్దపల్లి నాగరాజు అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జిల్లా పరిషత్ చైర్పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ సౌభాగ్యవాణికి వాహన పత్రాలను సురేష్ కుమార్, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్ పర్సన్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పథంతో హార్వెస్ట్ ఇండియా సంస్థ రాష్ట్ర నలుమూలల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని చెప్పారు.

వ్యాన్ అప్పగిస్తున్న ఆలపాటి, జడ్పీ చైర్ పర్సన్, సురేష్ కుమార్

జిఎస్‌టి తగ్గింపుతో సన్న, చిన్న కారు రైతులకు ఉపయోగం

ప్రజాశక్తి - దుగ్గిరాల

జి ఎస్ టి తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సన్న చిన్న కారు రైతులకు ఎంతో ఉపయోగం అని, అన్ని రకాల వ్యవసాయ పనిముట్లు యంత్రాల ధరలు తగ్గాయని మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయబాబు తెలిపారు. జిఎస్టీ సంబరాల్లో భాగంగా బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దుగ్గిరాలలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. తగ్గిన వ్యవసాయ పరికరాల ధరలను ప్రజలకు తెలియపరిచేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ పరికరాలు యంత్రాలపై జిఎస్టీ 12 నుండి 5శాతం తగ్గిందన్నారు. ఒక్కో ట్రాక్టర్ 21 వేల నుండి 85 వేల వరకు తగ్గిందఅన్నారు. తైవాన్ స్ప్రేయర్లు, పవర్ టి ల్లర్లు రోటవేటర్ల తో సహ వ్యవసాయ రంగానికి ఉపయోగపడే అన్ని రకాల పరికరాల ధరలు తగ్గాయని దీనివల్ల చిన్న సన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ సహకార సంఘాలు పాల ఉత్పత్తి దారుల సంఘాలు మరియు సుస్థిర వ్యవసాయం బలోపేతం అవుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో జిఎస్టి డిప్యూటీ డైరెక్టర్ ముత్యాలరావు, పశువర్ధక శాఖ ఏడి అన్నపూర్ణ, జిఎస్టి అధికారి సుధాకర్, ఏఈఓ ప్రజ్ఞాన్, ఎల్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల, ఫిరంగిపురంలో జిఎస్‌టిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలోని అత్తోట గ్రామంలో సూపర్ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు ట్రాక్టర్లు వ్యవసాయ యంత్ర పరికరాలు ,డ్రోన్లు ,బయో ఫెస్టిసైడ్స్ పాల ఉత్పత్తులపై రేట్లు గణనీయంగా తగ్గించినట్లు తెలిపారు జిఎస్‌టి తగ్గింపు ద్వారా ద్వారా రైతులకు హెక్టారుకు 1700 నుంచి 5000 వరకు ప్రయోజనం కలుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

పొలం పిలుస్తుంది, జిఎస్టి 2.0పై అవగాహన సదస్సులను ఫిరంగిపురం 2, 113 తాళ్లూరు గ్రామాలలో అధికారులు బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జె.వాసంతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిఎస్టీ స్లాబులను తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడంతో రైతులు కొనుగోలు చేసే వ్యవసాయ పరికరాలు, సేంద్రియ ఎరువులు, పంటలపై పిచికారీ చేయడానికి నూతన నూతన పరికరమైన డ్రోన్లపై నీటిని ఆదా చేయటానికి వాడే బిందు, తుంపర సేద్యాలపై కేంద్రం 18 శాతం జీఎస్టీ నుండి ఐదు శాతం తగ్గించారని, దీనివలన రైతులకు చాలా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. యూరియా ధరలు కూడా తగ్గియన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి షేక్ సుభాని, గ్రామ వ్యవసాయ సహాయకులు కిరణ్ నాగేశ్వరావు, హకీమ్, సుభాని పాల్గొన్నారు.

మాంసం విక్రేతలతో మాట్లాడుతున్న ఎంహెచ్ఓ

నేడు మాంసం, మద్యం విక్రయాలు బంద్

ప్రజాశక్తి - తెనాలి

గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం మాంసం, మద్యం విక్రయాలు నిషేధమని మున్సిపల్ ఆరోగ్యాధికారి ఎం.యేసుబాబు చెప్పారు. పట్టణంలోని మాంసం దుకాణాలను ఆయన బుధవారం సందర్శించారు. వ్యాపారులతో మాట్లాడారు. దసరా పండుగ అయినప్పటికీ, అదే రోజు గాంధీ జయంతి కనుక మాంసం విక్రయాలపై నిషేధం విధించినట్లు వారికి వివరించారు. వ్యాపారులంతా సహకరించాలని కోరారు.నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ ఎం.అప్పారావు ఉన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో గాంధీ జయంతి సందర్భంగా గురువారం మాంసం, చేపల విక్రయాలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిషేధం మాంసం, చేపల దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు సహా అన్ని వాణిజ్య సంస్థలకు వర్తిస్తుందని తెలిపారు. నిర్ణీత తేదీన నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో సంబంధితులపై చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

యజ్ఞంలా పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - కొల్లిపర

రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఓ యజ్ఞంలో సాగుతుందని శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం కొల్లిపర మండలం తూములూరు గ్రామంలో జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెని క్రిస్టినాతో కలిసి పెన్షన్లను పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందిస్తూ కావున అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెంద్రీ క్రిష్టినా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సూపర్ సక్సెస్ గా అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భీమవరపు చిన్న కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లాయర్ల పరీక్ష సెంటర్ ఎత్తివేతతో ఇక్కట్లు

ప్రజాశక్తి - దుగ్గిరాల

పర్మినెంట్ సర్టిఫికేట్ ఆఫ్ బార్ ప్రాక్టీస్ అర్హత పరీక్షలు నిర్వహించటానికి విజయవాడ పరీక్ష సెంటర్ తొలగింపు పట్ల లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. గత సంవత్సరం పరీక్షలు నిర్వహించడానికి రాష్ట్రంలో విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం సెంటర్‌లుగా ఉండేవి. ప్రస్తుతం విజయవాడ పరీక్షా కేంద్రం ఎత్తివేయటంతో ఈ ప్రాంత ప్రజలు విశాఖపట్నం గాని తిరుపతి గానీ సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం నవంబర్ 30 తేదీన పరీక్ష జరగనున్నది. హైకోర్టు కార్యాలయం ఈ ప్రాంతంలోనే ఉన్నందున ఇక్కడ ప్రాక్టీస్ చేసుకునేవారు ఎక్కువమంది ఉన్నారని, విజయవాడ కేంద్రాన్ని కొనసాగించాలని లా పూర్తి చేసిన వారు కోరుతున్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో గురువారం స్థానిక అశోక హైస్కూల్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు చిన్నం శ్రీనివాసరావు, కార్యదర్శి నాగేశ్వరరావు, ట్రెజరర్ కోడూరు నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. అన్ని దానాల కన్న రక్తదానం మిన్న అని, రక్తదానం ద్వారా వేరొకరి ప్రాణం కాపాడటం గొప్ప విషయం అని తెలిపారు. ఈ రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

దసరాకి ఉద్యోగులకు మొండి చెయ్యి

ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుక ఇవ్వకుండా ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా ఒక ప్రకటనలో అన్నారు. డిఎలుగానీ, ఐఆర్‌గానీ, బకాయిలుగానీ, చివరికి పిఆర్‌సి కమిషన్ కూడా లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా ఈరోజు వరకు నాలుగు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక్క డిఎ కూడా ఇవ్వలేదన్నారు. విజయదశమికి బకాయిలపై ప్రభుత్వం స్పష్టత ఇస్తుందని ఎదురు చూసిన ఉద్యోగులకు నిరాశే ఎదురైందన్నారు. 12వ వేతన సంఘం ఏర్పాటు చేయాల్సిన కాలం దాటి రెండున్నర సంవత్సరాలు అయ్యిందన్నారు. కనీసం కమిషన్ చైర్మన్‌ను కూడా నియమించలేదన్నారు. సిపిఎస్, జిపిఎస్‌పై ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని చెప్పిన ప్రభుత్వం ఇంత వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలన్నారు.

ఇనియన్‌పాకు బహుమతి అందజేస్తున్న రత్తయ్య, చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

విజ్ఞాన్స్ వర్సిటీలో ముగిసిన జాతీయ స్థాయి చెస్ పోటీలు

తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ ఇనియన్‌పాకు మొదటి బహుమతి

ప్రజాశక్తి-గుంటూరు

ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్రచెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో నిర్వహించిన '62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు' బుధవారం ముగిసాయి. ఈ పోటీల్లో తమిళనాడుకు చెందిన గ్రాండ్ మాస్టర్ ఇనియన్ పాకు మొదటి స్థానంలో నిలిచి, రూ.6 లక్షల నగదు బహుమతి గెలుచుకున్నాడు. రెండో బహుమతి కేరళకు చెందిన 15 ఏళ్ల ఇంటర్నేషనల్ మాస్టర్ హెచ్.గౌతమ్‌కృష్ణకు గెలుచుకొని రూ.5 లక్షల నగదు బహుమతి అందుకున్నారు. మూడవ స్థానంలో పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుకు చెందిన గ్రాండ్ మాస్టర్ శశికిరణ్ క్రిష్ణణ్‌కు రూ.4 లక్షల అందచేశారు. క్రీడాకారులు అందరికీ కలిపి రూ.30లక్షల విలువైన నగదు బహుమతులు అందజేశారు. ముగింపు సభలో విజ్ఞాన్స్ అధినేత డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ క్రీడాకారులకు గెలుపు ఒక వాక్యమని, ఓటమి అనేది ఒక పాఠశాల లాంటిదని అన్నారు. గెలిచిన ఆటగాడిని 'అతను గెలిచాడు' అని ఒక వాక్యంతో చెప్పేయవచ్చని, అది ఒక గౌరవం, ఆనందం, మధుర జ్ఞాపకం అని, గెలుపు అంతటితో ముగిసిపోతుందన్నారు. కానీ ఓడిన ఆటగాడి కథలో మాత్రం ఎన్నో పాఠాలు దాగి ఉంటాయన్నారు.ఎక్కడ పొరపాటు జరిగిందో, ఏ కదలికలో వ్యూహం బలహీనమైందో, ఎలా మారిస్తే తర్వాతి సారి విజయం సాధించగలమో తెలుసుకునే అవకాశం ఓటమి ద్వారా వస్తుందన్నారు. ఓటమి అనేది వెనకడుగు కాదని, అది ముందడుగుకు సిద్ధం చేసే ఒక అనుభవ యాత్రని పేర్కొన్నారు.క్రీడల్లో మెరుగ్గా రాణించేటటువంటి విద్యార్థులకు తమ యూనివర్సిటీలో 100 శాతం ఫీజు రాయితీ కల్పిస్తామన్నారు. అదే విధంగా తమ వర్సిటీ విద్యార్థులకు ఎవరైన కోచింగ్ ఇవ్వాలనుకుంటే వారికి ఉద్యోగ అవకాశాలను కూడా ఇస్తామన్నారు.అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటార్ ఆర్.అనంతరామ్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ ఛైర్మన్ సీహెచ్ ఏ ఆర్‌కే వర్మ, ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ ముయాంటీయా, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సెక్రటరీ కే.జగదీష్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ కేవీవీ శర్మ, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

ఆదికవి నన్నయ బట్టు పద్య నాటకంలో సన్నివేశం, సిరికేళి సాంఘిక నాటకంలో సన్నివేశం

పోటాపోటీగా పౌరాణిక సాంఘిక నాటకాల ప్రదర్శన

నూతలపాటి సాంబయ్యకు పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన కళల కాణాచి, ఆర్ ఎస్ ఆర్ గ్రీన్ వే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వీణ అవార్డ్స్ నాటకోత్సవాలు బుధవారం ఐదో రోజుకు చేరాయి. పౌరాణిక పద్య నాటకాలు, సాంఘిక నాటకాలు పోటా పోటీగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాటక పరిషత్తులు, కళాపరిషత్తుల తరపున ప్రదర్శిస్తున్న నాటకోత్సవాలలో నటీనటులు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తున్నారు. పౌరాణిక పద్య నాటకం బాగుందంటే, అంతకు మించి అన్న చందంగా సాంఘిక నాటిక, నాటకాలు ప్రదర్శిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు రెండు పౌరాణిక పద్య నాటకాలు, సాయంత్రం ఐదు గంటల నుంచి 9 గంటల వరకు సాంఘిక నాటకం, నాటిక ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. అంటే ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రేక్షకులను నాటక ప్రదర్శనలు కట్టిపడేస్తున్నాయి. నాటకోత్సవాలలో భాగంగా బుధవారం విజయనగరం కు చెందిన శ్రీ శ్యామలాంబ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ బందం 'ఆదికవి నన్నయ భట్టు' పద్య నాటకాన్ని ప్రదర్శించారు. కవి సమ్మేళనం నిర్వహించడం, కవులు తమ ప్రతిభా పాఠవాలను కవిత్వం రూపంలో ప్రదర్శించడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శారదా ప్రసన్న రచనకు ఈపు విజయకుమార్ దర్శకత్వం వహించారు. అలాగే సాంఘిక నాటక విభాగంలో విశాఖపట్నం కి చెందిన జయ కళానికేతన్ వారి 'సిరికేళి' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. పాచికల ద్వారా డబ్బు సంపాదించడం, అది కూడా మనిషి అవసరానికి మించి సంపాదించడం, మితం లేని డబ్బుతో ఎదురయ్యే అనర్థాలను కళ్లకు కడుతూ, అదే సమయంలో 'డబ్బు పేదవాడి చెంతకు చేరదు-మధ్యతరగతి వద్ద నిలువదు-ఐశ్వర్యవంతునికి మనశ్శాంతినివ్వదు' అన్న సందేశం తో నాటకం సాగింది. వేగి సూర్యనారాయణ రచనకు కె వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించారు. సాంఘిక నాటికల విభాగంలో గుంటూరుకు చెందిన సద్గురు కళానిలయం బందం'నాన్న' సాంఘిక నాటికను ప్రదర్శించింది. మాడభూషి దివాకర్ బాబు రచనకు బసవరాజు జయశంకర్ దర్శకత్వం వహించారు.

వేద గంగోత్రి వరప్రసాద్ పురస్కారం ప్రదానం...

వీణ అవార్డ్స్ నాటకోత్సవాలలో భాగంగా వేద గంగోత్రి వరప్రసాద్ జాతీయ రంగస్థల నిర్వహక పురస్కారాన్ని సత్తెనపల్లికి చెందిన ప్రగతి కళామండలి రథసారథి నూతలపాటి సాంబయ్యకు బహూకరించారు. నాటకోత్సవాలను కళల కాణాచి అధ్యక్షులు బుర్రా సాయి మాధవ్, చెరుకుమల్లి సింగారావు పర్యవేక్షించగా, పురస్కార ప్రధానోత్సవంలో పలువురు నాటక రంగ విశ్లేషకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

రక్తదానం మహోన్నత సేవ

ప్రజాశక్తి-గుంటూరు

రక్తదానం మహోన్నత సేవ అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. యువత ప్రజలు అపోహలు వీడి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. బుధవారం జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో రోటరీ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డిఎంహెచ్ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారి ప్రమాద క్షత గాత్రులకు, గర్భిణులకు, తల సేమియా వ్యాధిగ్రస్తులకు ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించే సంజీవని రక్తం మాత్రమేనని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ రక్తదానం చేయటానికి ముందుకు రావాలని కోరారు. యువతలో రక్తదానంపై అవగాహన కోసం రెడ్‌క్రాస్ చేస్తున్న కృషి ఆదర్శనీయమని చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ నా పదహారేళ్ళ వయసులో రక్తహీనత జబ్బుతో బాధపడుతున్న ఒక బాలుడి కోసం రక్తదానం చేశానని, వైద్య వృత్తిలో ఉంటూ, సమయ భావంతో ఉన్న నేను సమయం దొరికినప్పుడల్లా రక్తదానం చేస్తూ ఉంటానని చెప్పారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం అక్టోబర్ 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, రక్తమార్పిడి ద్వారా ప్రాణాలు కాపాడే అంశంపై విశేష కృషిచేసిన డాక్టర్ జేజి జాలిని స్మరించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. 18 సంవత్సరాలు వయసు, 50 కేజీల బరువు ఉండి, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం రక్తదాన శిబిరాలు నిర్వహించిన మాస్టర్ మైండ్స్, టీజేపీఎస్, మలినేని ఇంజినీరింగ్, సెయింట్ ఆన్స్ డిగ్రీ కాలేజి ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా వైస్‌చైర్మన్ పి.రామచంద్రరాజు, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అధ్యక్షులు నంబూరు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కాలేజిల ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు